
అక్కడ యుద్ధం జరిగినట్లు వుంది. మృత కళేబరాల్లా ఉన్నాయి టమోటా మొక్కలు. సైనికుల దండయాత్రేదో జరిగి నట్లుంది. పొలమంతా నానా భీభత్సంగా వుంది. టమోటాలు చితికిపోయి, నలిగి పోయి వున్నాయి. ఎకరా పొలంలో ఎక్కడా ఒక మొక్కా బతికి లేదు. ఒక్క టమోటా కూడా మిగల్లేదు.

ఎరుకల దొరస్వామి గుండెలవిసేలా ఏడుస్తున్నాడు. పక్కనే అతడి భార్య ఏడో నెల గర్భిణి నీలమ్మ కండ్లల్లో నీళ్ళు పొంగు తున్నాయి. ఆమె పక్కనే ఆరేళ్ళ కుర్రాడు రాజు దిక్కు తోచకుండా అమ్మా నాన్నల వైపు బిత్తరపోయి చూస్తూ వున్నాడు.

ఏం జరిగిందో, పొలం ఎందుకిట్లా నాశనం అయ్యిందో, అమ్మా నాన్న ఎందు కట్లా ఏడుస్తున్నారో వాడికి అస్సలు అర్థం కాలేదు. అమ్మ ఏడ్వడం తెలుసు, కానీ నాన్న ఏడ్వగా చూడ్డం ఇదే మొదటిసారి.




# వెదుళ్ళు

పలమనేరు బాలాజీ

ఊళ్ళో జనం, చుట్టుపక్కల రైతులు అక్కడ గుమిగూడిపోయారు.

''..ఎంత ఘోరం. మొత్తం పంటంతా ఎదన పెట్టుకున్నాయి కదా. వాటి దెబ్బకి పెద్ద పెద్ద రైతులే బికార్లయిపోతాండారు. దొరసామి గాడింక ఎప్పుడికి తేరుకోవల్ల? చ్చొ...చ్చొ..చ్చొ....''



''దీనికంటే మనిషినే తొక్కి చంపేస్తే పోలా? ఒక దినంతో పీడా పోతుంది. బతుకంతా బాదలు పడేదానికన్నా ఆ ఒక్క దినంతో బాదంతా తీరి పోతుంది.''

ఏడ్పుగొంతుతో అంటున్న దొరస్వామి వైపు అందరూ సానుభూతితో చూశారు.

''ఇదంతా మా ఖర్మ. ఆ దేవుడికే మా మీద దయ లేదు. వడ్డీకి దుడ్లు తెచ్చి సేద్యం చేస్తాండా. బిడ్డల్ని సాకినట్లు సాకినాం. ఈ దినంతో మాకు భూమి తల్లికి రుణం తీరిపోయింది. కన్నగసాట్లు పడి పంట చేసినాం. మా కడుపులో బాధ ఎవురికని చెప్పుకునేది తల్లో! మా బాధలెప్పుడు తీరతాయి తండ్రో!...'' నీలమ్మ ముక్కు చీదుతూ, చేతులు తిప్పుతూ శోకాలు పెడుతోంది.

''ఈ పక్క ఎట్లా వొచ్చినాయబ్బా? ఆ పక్క నించి వొచ్చి సముద్రపల్లె కల్లా ఎలబారినట్లున్నాయి. పోయిన వారం క్రిష్టారెడ్డి చెరుకుతోట మొత్తం పోయింది కదా'' అన్నాడొక రైతు.

''చెరుకనే ఏముందప్పా? బీన్సు తింటాయి, మామిడి కాయలు తింటాయి. చెనిగిచేనూ పెరికి ఆరబెడతాయి. ఒక పంటనేముంది? ఒక కాయ అనేముండాది తేడా?''

రాజుకు ఆ మాటలు కొన్ని అర్థమవుతున్నాయి. కొన్ని అర్థం కావడం లేదు. కొంత ఊహించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

జనం మెల్లగా కదులుతూ ఉన్నారు. చూపుల్లో కొందరు, మాటల్లో కొందరు సానుభూతి చూపిస్తున్నారు. ఎవరేం మాట్లాడినా భార్యాభర్తలిద్దరూ కన్నీళ్ళపర్యంతమవుతున్నారు.

''జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తాండాయి కదన్నా ముండా ఏనుగులు! ఎప్పుడు తీరతాయో మనకీ బాధలు'' అప్పుడే అక్కడకు వచ్చిన ఈశ్వరనాయుడు వైపు చేతులు చూపిస్తూ అడిగాడొక రైతు.

ఈశ్వర నాయుడ్ని చూడగానే దొరస్వామి చప్పున కదిలాడు. వెళ్ళి అతడి కాళ్ళ దగ్గర కూలబడిపోయాడు.

''సామీ నువ్వే కాపాడల. నీ ధర్మం మీదనే బతకతా వుంటి. సొంతంగా సేద్యం చేసుకుందామని పోరతా వుంటే మా ఆడదాని మాటలిని దీంట్లోకి దిగినా సామీ. వడ్డీకి దుడ్లు తెచ్చుకుంటి. ఇప్పుడింక నాకు బతికే మార్గమేదుండాది. నువ్వే కాపాడల్ల సామీ.''

ఈశ్వరనాయుడు తన కాళ్ళమీద పడిన దొరస్వామిని లేపే ప్రయత్నం చెయ్యలేదు. లెయ్యమనీ చెప్పలేదు.

చుట్టూ చూసాడు. ఊర్లోజనం చూస్తున్నారా లేదా అని గమనిస్తూ తలతిప్పి నీలమ్మ వైపు చూశాడు.

తలవంచుకుని నిలబడి వుంది నీలమ్మ. ఆమె మొహం జేవురించింది. పళ్ళ బిగువున కోపాన్ని, బాధను భరిస్తోంది. ఇంతలోనే మొగుడు వెళ్ళి నాయుడు కాళ్ళపైన పడతాడని ఆమె ఊహించలేకపోయింది. భూమి రెండుగా చీలి అందులో కూరుకుపోతే బావుండునని పిస్తోంది. రాజు చొక్కా గుండీలు విప్పి మళ్ళీ తగిలిస్తోంది.

నాయుడు దగ్గర దొరసామి సేద్యగాడుగా బతికిన వైనం ఆమెకు గుర్తొచ్చింది. నాయుడి కుటుంబానికి రెండు తరాలుగా సేవ చేసినా దొరస్వామికి నాయుడేం చేసాడో, ఏం చేయలేదో అది నీలమ్మకు అర్థమయ్యింది. కానీ దొరస్వామికి అర్థం కాలేదు.

దొరస్వామి తనకు ఏ పనీ చేతకాదని, నాయుడి ప్రాపకంలో బ్రతకడమే తన జీవితానికి పరమార్థమని నమ్మినవాడు. ఆ భ్రమలోంచి అతడ్ని తప్పించి నాయుడికి దూరం చేసి సొంతంగా కొంచెం సేద్యం చేసుకుందామని నీలమ్మ రాత్రి, పగలూ పోరు పెడితే అనేక గొడవల తర్వాత దొరస్వామి తమకు ప్రభుత్వం వాళ్ళిచ్చిన భూమిలో సేద్యం చెయ్యటానికి ఒప్పుకున్నాడు.

దొరసామి ఇంకా నాయుడి కాళ్ళ దగ్గరే కూలబడి వున్నాడు. తరతరాల బానిసత్వం, చిన్నప్పట్నుంచి ఊడిగం చేసిన ఒళ్ళు, నీలమ్మకు చీదరంగా వుంది.

నీలమ్మ పదో తరగతి వరకు చదువుకుంది. ఎట్లైనా బతకవచ్చు మామా. టౌన్‌కు వెళ్ళిపోదాం అంటే మొగుడు ఒప్పుకునింది లేదు. పల్లెలోనే వుండాలన్నాడు.

ఆ పక్క పొలం రామక్రిష్టారెడ్డిది.

ఆయనకు నాయుడికి పాత గొ[illegible] న్నాయి. కోర్టు కేసులూ జరుగుతున్నా[illegible] నీలమ్మే భర్త వద్దంటున్నా వినకుండా రా[illegible]ష్ణారెడ్డితో మాట్లాడి ఎకరా పొలానికి నీళ్ళు అరువు ఇప్పించుకుంది. నీకు మంచి జరిగితే నాయుడేం వొద్దనడులేబ్బా అని సర్ది చెప్పింది. అదికూడా నాయుడికి మంటగానే వుంది. రాబోయే ఎలక్షన్లలో వార్డు మెంబరు పదవి ఎస్టీలకు రిజర్వు చేయబడిందనే సంగతి నాయుడికి తెలుసు. రెడ్డికి తెలుసు. తెలియందంతా దొరస్వామికే.

ఊర్లో ఉండే ఐదారు ఎరుకల కుటుంబాల్లో అంతో ఇంతో పేరుండేది దొరస్వామికే కాబట్టి ఇద్దరూ అతడ్ని మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లోనే వున్నారు.

అప్పటికే నాయుడు అంతా ఆలోచించుకునే అక్కడికి వచ్చాడు.

''లేరా అబ్బోడా లే, వి.ఆర్.ఓ కి ఫోన్ చేసి చెప్తాను. ఎం.ఆర్.ఓ ఆఫీసులో అర్జీ ఇచ్చిరా. ఫారెస్టోళ్ళకీ చెప్తాలే. నీ పెండ్లాం చదువుకుంది కదా, ఆయమ్మనే అర్జీలు రాయమను. ముందు జరిగేది చూడు, అయ్యిందేదో అయిపోయింది. సాయంత్రం ఇంటికాడికి రా, బియ్యం, బేళ్ళూ ఇస్తాను. నీ పెండ్లాం అసలే ఒట్టి మనిషి కూడా కాదు. నేను ఈ లోగా టౌనుకు పోయ్యొస్తా... వస్తానమ్మా నీలమ్మా..''

మాటతో బాటే నాయుడు కదిలాడు. కదులుతూ కదులుతూ నీలమ్మ వైపు, పొలం వైపు చూస్తూ కదిలాడు.

అతడి కళ్ళలోని పైశాచిక ఆనందం నీలమ్మకు అర్థమైంది. దొరస్వామి, నాయుడు మాటలతో కొంత తేరుకున్నాడు.

"సామి నువ్వు టౌన్లో యాడుంటావో నాకు తెల్సిందేకదా, గంటలో నేనూ టౌనుకొచ్చేస్తా, ఏ ఆఫీసులో ఎవరికి చెప్తావో అంతా నీ ఇష్టం సామి, ఏం చేస్తావో ఏమో నిన్నే నమ్ముకుని బతకతా వుండా. నీ బిడ్డలాంటోడ్ని, నువ్వు కాకబోతే మాకు ఇంక దిక్కెవరుండారు చెప్పు? నువ్వు ముందు పద సామి, నీ ఎనకాలే వొచ్చేస్తా."

అప్పటికి తృప్తి కలిగింది నాయుడికి.

ఇంక దొరస్వామి తనను కాదని ఎక్కడికీ పోడనే నమ్మకం కలిగింది. జేబులోంచి యాభై రూపాయల నోటు తీసి దొరసామి చేతుల్లో పెట్టి "సరస్వతి హోటల్లో వుంటాను, ఆడికి వచ్చేయ్‌రా అబ్బోడా...." అని చెప్పి అక్కడ్నుంచి కదిలాడు.

నీలమ్మకు జరుగుతున్నదంతా అర్థం అవుతూనే వుంది. అయినా ఏం చెప్పినా మొగుడు తన మాట వినే పరిస్థితిలో లేడు.

నాయుడి ప్రాపకంలోకి తిరిగి వెళ్ళడం అంటే పులి గుహలోకి గొర్రె వెళ్ళినట్లే. అవును గొర్రే! లేకుంటే కసాయి వాడ్ని ఎట్లా నమ్ముతాడు? జరిగింది జరిగిపోయింది. జరగాల్సిందేమిటో చూడాలి. నాయుడి ప్రాపకంలోకి మొగుడు తిరిగి వెళ్ళాడంటే ఆ రామక్రిష్ణారెడ్డి ఈ పొలానికి నీళ్ళివ్వడు, నీళ్ళు లేకుండా సేద్యం చెయ్యటం కుదరదు.

ఊర్లో అందరికీ కంటగింపుగానే వుంది దొరస్వామి సేద్యం. ఆ సంగతి నీలమ్మకూ తెలుసు.

ఏం చెయ్యాలి! మొగుడ్ని ఎట్లా నిలువరించాలి? కలో గంజో స్వంతంగా సంపాదించుకుని తాగుదామనుకుంటే ఈ ఏనుగుల పీడొకటి.

అయినా ఆ ఏనుగులకు కూడా పేదోడి పంటే కావాల్సి వచ్చిందా? అడవిలోంచి వచ్చినా ఏనుగులు ఐదారు మంది రైతుల పొలాల్ని దాటుకునే కదా రావాలి! ఏం? సరిగ్గా ఈ పొలంలోని పంటే వాటికి కావాల్సి వచ్చిందా?

మెల్లగా మొదలైన అనుమానం క్షణాల్లో పెరిగి పెద్దదయిపోయింది నీలమ్మ మనసులో.

"మా .... నేనూ నాయనతో బోతా మా ...." అంటూ రాజు ఏడుపు అందుకున్నాడు.

తేరుకుని చూస్తే తనతో మాట మాత్రం చెప్పకుండా నాయుడి వెనుక మెడవంచి వెడుతున్న మొగుడు దూరంగా కనిపించాడు.

లాగి ఒక్కటిచ్చింది పిల్లాడి వీపు మీద.

"మూస్కోని ఈడ్నే వుండ్రా, మీ నాయిన పోతా వుండాడు కదా తోకాడిస్తా, ఇంక నువ్వు కూడా పోవల్నా? ఇంటికొకడు ఊడిగం చేస్తే చాల్లే నోర్మూసుకో..."

మొగుడిపైన చూపించాల్సిన, చూపించలేని కోపం కొడుకు పైన చూపించినందుకు మరు నిముషంలోనే తనపైన తనకే కోపమొచ్చింది. దాంతో బాటే ఏడుపు వచ్చింది. పంటి బిగువున బాధని, కోపాన్ని, ఏడుపుని భరించింది. బానిస బతుకు బతకటం ఎట్లా? ఆ తిండి సగించదు. చస్తే తను తన బిడ్డకూ ఆ తిండి పెట్టదు...

***

కుళ్ళి, కుళ్ళి ఏడుస్తోంది నీలమ్మ. రాత్రి భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో దెబ్బలు తగిలాయి. అక్కడక్కడా నొప్పులు, గుండెలో మంటగా వుంది.

రాత్రి తొమ్మిది దాటి ఉంటుంది.

రాజు భయపడి ఏడుపు మొదలు పెట్టేసాడు.

"పంట నాశనం చేసింది ఏనుగులు కాదేమో నబ్బా, ఎక్కడా ఏనుగుల అడుగులూ లేవు. లద్దె కూడా కనబడలే. నువ్వూరికే నాయుడ్ని నమ్మద్దు గుడ్డిగా" అంది నీలమ్మ మొగుడికి అన్నం పెడుతూ...మెల్లగా.

కంచాన్ని విసిరికొట్టి జుట్టుపట్టుకుని వీపు మీద గుద్దాడు దొరస్వామి. చెంపలు వాయించేశాడు.

"నీయమ్మ నీ కంటికి ఎట్టా కనపడతాండానే. మొగుడ్ని ఎదవను చేసి కొంగుకు కట్టుకుని ఆడిస్తావుండాదని ఊర్లో అంటాండారు. నీకు నాయుడు పైన గురి లేదు. రెడ్డి తియ్యగా మాట్లాడినాడు కదా, వాని మాటే వింటావు. కొంగు పరుస్తా వుండావా వాడికి? తోలు తీసేస్తాను. నోర్మూసుకుని కొంపలో పడిండు. యాడుండే దానివి ఆడ్నే వుండు, లేదంటే నా చేతుల్లోనే ఐపోతావ్. నీ మొగం చూడు, ముండ మోపి మొగం థూ......" ఎంగిలి ఉమ్మి వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఉక్కగా వుంది. ఉదయం నుండి ఏడ్చి, ఏడ్చి గొంతు మండుతోంది, జ్వరం వచ్చినట్లు వుంది.

గుడిసెలోంచి బయట కొచ్చింది.

రాజు తల్లిని అనుసరించాడు.

పక్క గుడిసె ముందర నులక మంచంలో దేవరాజులు తాత సగం కళ్ళు మూసుకుని తత్వాలేవో పాడుకుంటున్నాడు. దబ్బలు అల్లినవి, చీల్చినవి, గంపలు వెదుర్లతో చేసినవి వెన్నెల్లో మెరిసిపోతున్నాయి.

చిన్నప్పుడెప్పుడో దబ్బలు అల్లేది. ఇంట్లో అదే వృత్తి. వారం వారం సంతలకు వెళ్ళి వాటిని అమ్ముకొచ్చేవాళ్ళు, నీలమ్మ కళ్ళు తుడుచుకుంది.

రాజును సముదాయించింది.

"ఏరా ... రేపు నీకు చిన్న గంప చేసిస్తాన్లే, ఊర్కో.... ఏడవకు" అంది కుదుటపడ్డ మనసుతో.

ఆ మాటతో రాజు మొహంలో నవ్వు కదలాడింది.

*

రచయిత సెల్ నెం: **9440995010**

కవిత

## వానజాణ....



ఏకాంత సంకేత స్థలాల్లో
ప్రియ విభుడిని కలిసే ప్రేయసిలా-
ప్రతి సాయంత్రం తను నన్ను కలుస్తూనే ఉంది
కలసిన మొదటి క్షణంలోనే చిరుజల్లుల చిర్నవ్వులు-
చిటపట చినుకుల అభిషేకాలు...
ఆపై, మంచుపూల వెన్నెలలు
మధురోహల వెల్లువలూ...
ఒక సెకనులో తుపానై చుట్టుముట్టేస్తుంది
వరద పొంగై వాటేస్తుంది... వలపు పాటై కమ్మేస్తుంది...
గాలి కూడా చొరనీయని గాఢబంధనం
ఊపిరైనా తీయనీయని
తీయతేనియ చుంబనం
నే ఉక్కిరి బిక్కిరి అవుతా-
తను నను కలిసిన వేళ-
ప్రకృతిలో
అనంతానంత ఆనంద నృత్యహేల-
ఆకాశం నీలితెరపై ఉరుముల గానాబజానా..
తటిల్లతల లేజర్ షో...
మొన్న వచ్చిన వేళకే నిన్న-
నిన్న వచ్చిన వేళకే నేడు-
వారం రోజులుగా తను
నను వదలని తోడు-
అయిదైతే చాలు...
ఒక సెకను ఆలస్యం కాదు-
ఒకవేళ తను రాలేదా?
ఇక, ఆ రోజుకి... అయిదు కానట్టే....?
ప్రేమతో తను పొంగి పొర్లుతుంటే...
ఆ జడివానలో తడిసి ముద్దవుతున్నా..
ఆకాశం ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని
ఉరుముల మెరుపులతో జుగల్‌బందీ చేసేస్తుంటే-
ఎడతెరిపిలేని ఆనందోత్సాహంతో
వానజాణ వలపంతా కుమ్మరించేస్తుంటే
ఒక్కో చినుకు రాలి పడుతూ
మువ్వల సవ్వడి చేసేస్తుంటే...
జలతరంగిణిలో జలకాలాడుతూ-
మున్నెన్నడూ వినని సంగీతాలు వింటున్నా-
మాటా, భాషా మరిచి, మౌనిలా మారి-
నిలువునా కరిగి కరిగి... నేనూ నీరే అవుతున్నా-
కట్టలు తెంచుకున్న కన్నీరే అవుతున్నా..
అలా... అలా... అలలా తను పొంగి పోటెత్తుంటే-
ఆఘమేఘాల మీద వర్షం
అవనిపైకి దూకుతుంటే
నా కళ్ల వాకిళ్లలో ఎప్పటికీ...
అలనాటి గంగావతరణ ఘట్టమే!

*-పి.వి.డి.ఎస్.ప్రకాష్*
సెల్: **90005 44160**